ఏడాదిన్నరైనా ఇంతేనా!

- వినగడప వంతెనపై కూటమి నేతల హామీలు గాలికి
- ప్రకటనలకే పరిమితమైన వంతెన నిర్మాణం
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు


గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టిలేరుపై వంతెన లేక ప్రజల ఇబ్బందులు

తిరువూరు: గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టిలేరుపై గతంలో వరదలకు కొట్టుకుపోయిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం తాము గెలిచిన వెంటనే చేపడతామని కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర అయింది. వంతెన విషయంలో ప్రకటనలతోనే కాలక్షేపం చేస్తున్న అధికార పార్టీ నేతలు ఎప్పటికి వంతెన పనులు చేపడతారో చెప్పలేకపోతున్నారు.

కొట్టుకుపోతున్న తాత్కాలిక రహదారి

మండల కేంద్రమైన గంపలగూడెం నుంచి వినగడప, కనుమూరు, కొత్తపల్లి, అనుముల్లంక, నారికింపాడు, తండాలకు వెళ్లడానికి, జిల్లా కేంద్రమైన విజయవాడకు సైతం వెళ్లేందుకు ఇదే రహదారిలో ప్రయాణించాల్సి ఉంది. గతంలో పలుమార్లు వంతెన నిర్మాణం చేపట్టని కారణంగా తాత్కాలిక రహదారి నిర్మించినప్పటికీ కొద్దిపాటి వరద వచ్చినా కొట్టుకుపోతుండటంతో నెలల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి.

వాగులో దిగి ప్రమాదకరంగా రాకపోకలు

తాత్కాలిక రహదారుల నిర్మాణానికే ఇప్పటికి లక్షలాది రూపాయలు ఖర్చుచేసిన రహదారులు, భవనాల శాఖ హై లెవెల్ వంతెన నిర్మాణం విషయంలో ఉదాసీనవైఖరి అవలంబిస్తోందని మండల ప్రజలు వాపోతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వాగులో దిగి నడిచి వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. వరద ఉధృతంగా వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళనలు బేఖాతరు

గంపలగూడెం మండలంలో వినగడప వద్ద కట్టిలేరుపై వంతెన లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వానికి తెలిపేందుకు ప్రజా సంఘాలు పలుమార్లు ఆందోళనలు చేసినా ఫలితం కనిపించడం లేదు. అత్యవసర సమయాల్లో సైతం వాగు అవతలి గ్రామాల ప్రజలు 30 కిలోమీటర్లు తిరిగి రావలసిన పరిస్థితి నెలకొంది. ఈ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.24 కోట్లు కేటాయించగా, ఆర్ అండ్ బీ అధికారులు సాంకేతిక అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేయడంతో ఎన్నికల నియమావళి కారణంగా పనులకు బ్రేకు పడింది. తదుపరి ఎన్నికల సమయంలో కూటమి నేతలు వంతెనకు అనుమతులు తెచ్చేదీ, కట్టేదీ తామే నంటూ ప్రచారం చేసినప్పటికీ ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడలేదు.

వెంటనే నిధులు కేటాయించాలి



గంపలగూడెం మండల ప్రజలకు ఎంతో అవసరమైన వినగడప వంతెన నిర్మాణ పనులను చేపట్టడంలో ఉదాసీన వైఖరి తగదు. వెంటనే అవసరమైన నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి. ఇప్పటికే పలుమార్లు ప్రజలకిచ్చిన హామీలను కూటమి నేతలు నెరవేర్చలేకపోయారు.

– నల్లగట్ల స్వామిదాసు, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి

ప్రజా సమస్యలపై ఆందోళన



నిత్యం ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న వినగడప వంతెన నిర్మాణం విషయంలో అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు నిర్వహించి వంతెన సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదు.

– నాగుల్‌మీరా, సీపీఐ గంపలగూడెం మండల కార్యదర్శి

హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



తాతకుంట్ల(విస్సన్నపేట): అధికారంలోకి వచ్చి సంవత్సరం ఆరుమాసాలు కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. మండలంలోని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సెక్రటరీగా నియమితులైన తాణంకి రాంబాబు సన్మాన కార్యక్రమం గురువారం తాతకుంట్ల గ్రామంలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు సిరసాని ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వామిదాసు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 1,500, 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్లు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలులను వివరించారు. హామీలు అమలు చేయకుంటే కూటమి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రాంబాబును అభినందించి సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, సర్పంచ్ వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎస్. వీరారెడ్డి, కోటా దాసు, మేడా తిరుపతిరావు, పల్లెపాం లక్ష్మయ్య, చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరపత్రాలు ఆవిష్కరణ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ప్రతి పేద కుటుంబం సొంతింటి కలను సాకారం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో అంగీకార్ 2.0 (ప్రధాన మంత్రి ఆవాస్ యోజన) పథకం కరపత్రాలను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అర్హులైన వారికి ఇంటి నిర్మాణానికి పీఎంఏవై అర్బన్ పథకంలో రూ.2.50 లక్షలు సబ్సిడీ రూపంలో అందిస్తోందన్నారు. సొంత స్థలం కలిగి ఉండి అర్హులైన వారు ఏఈ హౌసింగ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మాస్మి గనియా, ఏఈ రామకృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

స్థూలకాయం నివారణకు జాగ్రత్తలు పాటించాలి



కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): స్థూలకాయం నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని మైలవరం ఐసీడీఎస్ సీడీపీఓ కె. పుష్పలత అన్నారు. కొటికలపూడి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అధిక బరువు నివారణకు చక్కర, నూనె వినియోగం తగ్గించుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన నియమాలు, శారీరక శ్రమ పాటించాలని గర్భిణులు, బాలింతలకు వివరించారు. బీఎంఐ స్క్రీనింగ్ టెస్ట్ చేసి స్థూలకాయం వలన వచ్చే అనర్థాలను వివరించారు. సర్పంచి రెంటపల్లి నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, విజయ భారతి ఫౌండేషన్ ప్రతినిధి దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి ఎంపీడీఓగా రాజు



చాట్రాయి: చాట్రాయి ఎంపీడీఓగా బళ్ల రాజు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరులపాడు మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా, ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేస్తూ పదోన్నతిపై చాట్రాయి ఎంపీడీఓగా జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది ఎంపీడీఓను అభినందించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



చాట్రాయి: నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయని ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. చాట్రాయి సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రద్దీగా ఉండే నాలుగు రోడ్ల సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటి ద్వారా దొంగతనం చేసిన నేరగాళ్లను గుర్తించవచ్చని చెప్పారు. రాష్ట్ర సరిహద్దుగా ఉన్న చనుబండ సెంటర్‌లో త్వరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

తిరువూరు: మండలంలోని వావిలాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా ఈ టీకాలు వేస్తున్నామని పశువైద్యాధికారి అభిలాష్ తెలిపారు. వావిలాలలో 108 పశువులకు టీకాలు వేశామన్నారు. పశు యజమానులు తమ పశువులకు తప్పక వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. సర్పంచి అలవాల రాధ, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన విశ్వకర్మ జయంతి వేడుకలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో రెండు రోజులుగా జరిగిన శ్రీ మద్విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ముగిశాయి. శ్రీ మద్విరాట్ విశ్వకర్మ ఆలయంలో గురువారం విశ్వకర్మ దీక్షాధారణకు సంబంధించి యజ్ఞోత్సవం, మాల విరమణ చేసి ఇరుముడికి పూర్ణాహుతి జరిపారు. కార్యక్రమంలో శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి వారి 8వ తరం ముని మనువడు శ్రీ మద్విరాట్ వీరంభట్లయ్య ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ట్రస్టీ నిర్వాహకులు బ్రహ్మశ్రీ కత్తురోజు రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల వేతనాలను పెంచేందుకు గాను పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఏపీఎన్‌జీఓ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. నూజివీడులోని ఎన్‌జీఓ భవన్‌లో గురువారం నూజివీడు తాలూకా యూనిట్ అధ్యక్షుడు గూండ్రు శ్రీనివాసరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల డీఏ బకాయిలను విడుదల చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా కార్యదర్శి పి.రమేష్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఏపీఎన్‌జీఓలో సభ్యత్వం తీసుకోవాలని, సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సమస్యలను జిల్లా నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నూజివీడు తాలూకా యూనిట్ కార్యదర్శి టి.శ్రీనివాసబాబు, కోశాధికారి డి.వెంకటేశ్వర్లు, సందీప్, మహిళా నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

తిరువూరు: తిరువూరు మండలంలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. స్థానిక బైపాస్ రోడ్డులో ఆగి ఉన్న కారు డ్యాష్ బోర్డు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.లక్ష చోరీ చేసిన ఘటన మరువక ముందే తిరువూరు మండలం లక్ష్మీపురంలో ఒక మహిళ మెడలో విలువైన బంగారు ఆభరణాలను అగంతకులు దోచుకున్నారు. చోరీ చేసిన నగలతో ఆటోలో పరారైన వారి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన దొంగల ముఠా ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన మోటారు వాహనాలపై వస్తున్న దోపిడీ దొంగలు పోలీసుల చేతికి చిక్కకుండా నేరాలకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీలలో లభించిన ఆధారాలతో నేరస్తుల కోసం పోలీసులు గాలిస్తున్నా ఫలితం ఉండటం లేదు. నేరాల అదుపునకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

నూజివీడు: మున్సిపల్ కార్మికులందరికి పీఆర్సీ జీతాలను చెల్లించాలని, 12వ పీఆర్సీని ప్రభుత్వం ప్రకటించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు జి.రాజు డిమాండ్ చేశారు. నూజివీడు మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేతృత్వంలో మున్సిపల్ కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో కార్మికులు చేసిన 17 రోజుల సమ్మె కాలానికి కదుర్చుకున్న ఒప్పందాలకు సంబంధించి జీఓలను ప్రభుత్వం తక్షణమే జారీ చేయాలని, మరణించిన, అనారోగ్యంతో రిటైర్ అయిన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలను ఇవ్వాలని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలని, పర్మినెంట్ కార్మికులకు డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జయలక్ష్మి, రజని, శ్యామలాదేవి, పంగిడి అమ్మ, భారతి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

నూజివీడు: నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతామని చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చుకోవాలని నూజివీడు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది ఇందుపల్లి సత్యప్రకాష్ డిమాండ్ చేశారు. పలువురు న్యాయవాదులు గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాల సరిహద్దులు మార్చేందుకు ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం గాని, వాగ్దానం చేసిన మంత్రి కొలుసు పార్థసారథి గాని, ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు చూస్తుంటే ఎన్టీఆర్ జిల్లాలో కలిపేందుకు సుముఖంగా ఉన్నట్లు కనిపించడం లేదన్నారు. ఒకవైపు నూజివీడును సీఆర్‌డీఏ పరిధిలో ఉంచి, మరోవైపు ఏలూరు జిల్లాలో ఉంచడం వలన అభివృద్ధిలో ఈ ప్రాంతం వెనుకబడి పోతుందన్నారు. నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతామనే వాగ్దానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి మంత్రి కొలుసు పార్థసారథి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా ఉదయం 9.30 గంటలకు కోర్టు వద్ద నుంచి న్యాయవాదులు ర్యాలీ జరుగుతుందన్నారు.

వాగ్దానం చేసేటప్పుడు తెలియదా?

మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలోనూ, కైకలూరును కృష్ణా జిల్లాలోనూ కలపడం వలన ఏలూరు జిల్లాలో నియోజకవర్గాలు తగ్గిపోతాయని మాట్లాడుతున్నారని, వాగ్దానం చేసేటప్పుడు ఆ విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఓట్ల కోసం హామీ ఇచ్చి, అవసరం తీరిందని ఇలా మాట్లాడటం సమంజసం కాదన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం రమేష్, కార్యదర్శి వై. హరిబాబు, సీనియర్ న్యాయవాదులు వైఎస్ దొరై, మడుపల్లి మధు రవిశంకర్, పలగాని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం-నూజివీడు రోడ్డుకు శంకుస్థాపన

మైలవరం: మైలవరం-నూజివీడు ఆర్ అండ్ బీ రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎంతో కాలంగా ఈ రహదారిపై గుంటలు ఏర్పడి వర్షం నీరు నిలిచి గుంటలు కన్పించకపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు రాజకీయపార్టీల ఆధ్వర్యంలో ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రహదారి అభివృద్ధికి అధికారులు అంగీకరించడంతో జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహనరావు(గాంధీ) పనులు ప్రారంభించేందుకు గురువారం శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ



ఆలయంలో చోరీ చేసేందుకు వచ్చి సీసీ కెమెరాలకు చిక్కిన దొంగలు

జి.కొండూరు: మండల పరిధి మునగపాడు గ్రామంలో దక్షిణ ముఖ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఇద్దరు దొంగలు గేటు తాళం పగలగొట్టి దేవాలయం లోపలికి చొరబడినట్లు దేవాలయంలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయింది. ఈ చోరీలో స్వామివారి వెండి శఠగోపురం, వెండి ప్లేటు, స్వామి వారికి అలంకరించే వెండి కన్నును దొంగలు ఎత్తుకెళ్లారు. హుండీలో నగదును కానీ, బీరవాలో ఉన్న విలువైన వెండి వస్తువులను కానీ, బంగారపు సూత్రాలను కానీ దొంగలు ముట్టుకోలేదు. దొంగలు ఎత్తుకెళ్లిన వెండి వస్తువుల విలువ రూ.1లక్ష వరకు ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. స్వామివారికి పూజ చేసేందుకు గురువారం ఉదయం దేవాలయానికి వెళ్లిన పూజారి గేటు తాళం పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించారు. చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులలో ఒకరు చెప్పులు వేసుకొని గర్భాలయంలోకి వెళ్లడంతో అశుభంగా భావించి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఇదే దేవాలయంలో గతంలో కూడా చోరీ జరగడంపై స్థానికంగా ఉండే వ్యక్తుల ప్రమేయం ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు


నూజివీడు: మండలంలోని మీర్జాపురంలో ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన గొడవలను రెండు కులాల మధ్య, రెండు పార్టీల మధ్య గొడవలుగా మార్చిన ఘటనపై గ్రామంలో నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, నూజివీడు సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ గురువారం విచారణ నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామ పెద్దలను కలిసి జరిగిన ఘటనకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ రెండు కుటుంబాల మధ్య జరిగిన వ్యక్తిగత గొడవను పురస్కరించుకొని రెండు కులాల మధ్య గొడవగా మార్చారన్నారు. కులాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనేలా చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో శాంతియుత వాతావరణానికి అందరూ సహకరించాలని కోరారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. రూరల్ ఎస్‌ఐ జ్యోతిబసు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

400 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



ముసునూరు: విద్యార్థుల కోసం ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్, మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విజయవాడ, నూజివీడుకు చెందిన విజయ దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. 400 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. సంస్థల ప్రతినిధులు రావి సురేష్‌బాబు, గద్దె శేషగిరి, తాతినేని శ్రీహరిరావు, పోలవరపు నరసింహారావు, కొత్తపల్లి పూర్ణ చంద్రరావు, హెచ్‌ఎం అల్లాభక్షు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్కెట్ యార్డు



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ యార్డ్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. అధికారులకు మార్కెట్ యార్డ్‌లో ఉన్న గోడౌన్‌లను అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ వాటి బాగోగులపై లేదు. మార్కెట్ యార్డు రెండు గేట్లకు తాళాలు వేసినా ఒక వైపు ప్రహరీ కూలిపోవడంతో అటు నుంచి లోపలికి ప్రవేశించి జూద క్రీడలు, మద్యపానం సేవించడం వంటి అసాంఘిక కార్యక్రమాలకు కొందరు పాల్పడుతున్నారు. అసాంఘిక కార్యక్రమాలతో చుట్టుపక్కల నివసించే వారు భయాందోళన గురవుతున్నారు. అధికారులు స్పందించి మార్కెట్ యార్డ్‌కు పూర్తి స్థాయిలో కాపలా సిబ్బందిని నియమించి పడిపోయిన ప్రహరీని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

హామీల అమలు ఎప్పుడు బాబూ..

నూజివీడు: నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని, అలా కాకుండా కుంటి సాకులు చెబితే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని నూజివీడు సాధన సమితి జేఏసీ అధ్యక్షుడు మరీదు శివరామకృష్ణ, సెక్రటరీ ముమ్మలనేని సునీల్‌కుమార్, కోశాధికారి చాట్ల పుల్లారావు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నూజివీడులో నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారన్నారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకుంటే గుణపాఠం తప్పదన్నారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మునేటి నుంచి అక్రమంగా తెలంగాణకు ఇసుక తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కాపురం గ్రామంలోని మునేటి నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తెలంగాణకు తరలిస్తున్నట్లు బుధవారం అర్ధరాత్రి సమాచారం వచ్చిందన్నారు. దీంతో సిబ్బందితో వెళ్లి మునేటిలో దాడులు నిర్వహించి ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మంది డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

నేడు విద్యారంగ సమస్యలపై ధర్నా

నూజివీడు: విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నూజివీడులోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో నడపడాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3,500లకు పైగా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

120 మందికి వైద్య పరీక్షలు

చాట్రాయి: మహిళ ఆరోగ్యకరంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యకరంగా ఎదుగుతుందని మండలంలోని చనుబండ పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. చనుబండ-2 సచివాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబంలోని మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలన్నారు. కుటుంబ ఆరోగ్యం ఇంటి మహిళపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. అనంతరం 120 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

- **కొండపర్వ(విస్సన్నపేట):** స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కొండపర్వ గ్రామంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యాధికారి కె. శ్రీనివాసరావు, సర్పంచ్ జి. రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2 వరకు వైద్య శిబిరాలు

నూజివీడు: మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ఎంతో దోహదపడుతుందని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. తుక్కులూరులో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వైద్య శిబిరంలో మహిళలు పలు రకాల స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకోవచ్చన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు మహిళలకు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు. గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ నజ్మా మాట్లాడుతూ కుటంబం అంతా ఆరోగ్యంగా ఉండాలంటే ముందు మహిళ ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం ఆరోగ్య శిబిరంలో మహిళలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. సర్పంచి తొమ్మండ్రు బుజ్జి, ఉప సర్పంచి అచ్చి కాసులు, పంచాయతీ కార్యదర్శి చంద్రిక, హెల్త్ సూపర్‌వైజర్ గూండ్రు శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

చాట్రాయి: మండల స్థాయి క్రీడాకారులను ఎంపిక చేశామని ఎంఈఓ-1 మాసగిరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిన్నంపేట జెడ్పీ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన క్రీడాకారుల ఎంపిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించడానికి విద్యార్థులు ఆసక్తి చూపాలని చెప్పారు. అనంతరం కబడీ 12 మంది బాలికలు, 12 మంది బాలురు, సీనియర్, జూనియర్ ఖోఖో విభాగంలో 26 మంది, వాలీబాల్ 12 మంది బాలురను ఎంపిక చేశామని చెప్పారు. ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం



నూజివీడు: తల్లులు, పిల్లల్లో పోషకాహార లోపాన్ని రూపు మాపడమే 8వ రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమ లక్ష్యమని సీడీపీఓ పిల్లి విజయకుమారి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో హటియా తండాలో గురువారం గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి రోజూ ఉడకబెట్టిన కోడిగుడ్డు తీసుకోవాలని చెప్పారు. తద్వారా పిల్లల్లో ఎదుగుదల లోపాన్ని, మహిళలు, కిశోర బాలికలు రక్తహీనతకు లోనుకాకుండా సమర్థవంతంగా నిరోధించవచ్చన్నారు. రెండేళ్ల లోపు వయస్సు కలిగిన పిల్లల్లో తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి వారికి మెరుగైన పోషకాహారాన్ని అందించి లోపాన్ని సరిచేస్తామన్నారు. సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.